క్లుప్తంగా

వ్యవసాయ కార్యాలయానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు, అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక పంచాయతీ కార్యాలయం పక్కన ఆర్బీకే వెనుక పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న వ్యవసాయ మండల కార్యాలయానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, ఏఓ అక్బర్‌బాష, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, పీఆర్ ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి పూజాది కార్యక్రమాలు నిర్వహించగా వెంకటనాయుడు, గట్టు ఆరిఫ్, దేవరాజ్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో భరత్ రెడ్డి కాంప్లెక్స్‌లో వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయం శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు పార్టీ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, వెల్దుర్తి మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా జరుగనున్న కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని వారు కోరారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

నందవరం: ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తిమ్మయ్య హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని నదికైరవాడి గ్రామంలో తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 4 ట్రాక్టర్లను ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న 4 ట్రాక్టర్లతో పాటు నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం అనుమతించిన రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుకను తరలించాలన్నారు. దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ సాయంపై హర్షం

వెల్దుర్తి(కృష్ణగిరి): కృష్ణగిరి మండలం తొగర్చేడు ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు ఎస్వీ శేషారెడ్డి హైదరాబాద్ ఆసుపత్రిలో ఖరీదైన చికిత్స పొందినా కోలుకోలేక మరణించాడు. అతని కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని ఈనెల 14న సీఎం సహాయనిధి నుంచి రూ.13 లక్షలు అందించడంపై ఏపీటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వెల్దుర్తి మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీటీఎఫ్ నాయకులు మహేశ్వరరెడ్డి, పెద్దస్వామి, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

బడేసాహెబ్ దర్గాను దర్శించుకున్న ప్రముఖులు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో సద్గురు మహాత్మ గంజిహళ్లి బడే సాహెబ్ స్వామి ఉరుసు సందర్భంగా శుక్రవారం పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి వేరువేరుగా వచ్చి దర్గాను దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. వారికి సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల రెడ్డి నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ నాయకులు మహేష్ రెడ్డి, తోలు రాముడు, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో డ్రైనేజీ పనులు



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో రూ.10 లక్షలు జడ్పీ నిధులతో డ్రైనేజీ పనులు చేపట్టనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని రంగనాథ స్వామి దేవాలయం వద్ద మురుగునీరు ప్రవహిస్తుండడంతో దుర్వాసన కారణంగా భక్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందువల్ల కాలువ నిర్మించి నీటిని మళ్లించి సమస్యను పరిష్కస్తామన్నారు. సర్పంచ్ కారుమంచి మల్లికార్జున, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఉప సర్పంచ్ గోపాల్, ఈఓ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు

చిప్పగిరి: ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ బాలనాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. మండలం మొత్తానికి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 290 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు.

అభివృద్ధికి కేరాఫ్ వైఎస్సార్‌సీపీ



మల్లెపల్లెలో ఆర్బీకే శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



సర్పంచ్ విజయలక్ష్మితో కలిసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

వెల్దుర్తి(కృష్ణగిరి): వాడవాడలా, పల్లెపల్లెనా అభివృద్ధి చేసి చూపిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆమె శుక్రవారం వెల్దుర్తి మండలంలోని మల్లెపల్లె గ్రామంలో రూ.62 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాలు ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా గ్రామస్తులు ఆమెకు ఘనస్వాగతం పలకగా గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.16.70 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్లను గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంతరెడ్డి, ఆర్బీకే స్థలదాత రోశిరెడ్డి దంపతులు, వీహెచ్‌సీ స్థలదాత, సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం రూ.23.94 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనం, రూ.20.84 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. ఆర్బీకే స్థల దాత రోశిరెడ్డి దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం తెచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, సంక్షేమ పథకాల అమలుతో పాటు రహదారులు, పాఠశాలలు, వైద్యశాలలు, ప్రభుత్వ భవనాలు నిర్మించి, మరమ్మతులకు గురైన వాటిని ఆధునీకరించి, అభివృద్ధికి అర్థం చెప్పాడన్నారు. ఆయా కార్యక్రమాలలో నియోజకవర్గ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, ఏఓ అక్బర్ బాషా,పీఆర్ ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి, వైద్యాధికారి ఆనందరావ్, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పెద్దహుల్తి గ్రామంలో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీరు అందించేందుకు రూ.55 లక్షలతో పూర్తి చేసిన పనులను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శుక్రవారం ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామ నాయకుడు నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా ప్రజలకు నీటిని అందించేందుకు ఏర్పాటుచేసిన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా హోసూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఎంపీపీ నారాయణదాస్, ఎంపీడీఓ రామారావు, కోతిరాళ్ల, చక్రాళ్ల సర్పంచ్‌లు అంజినయ్య, శ్రీరాములు, మండల కన్వీనర్ నాగరాజు, ఎంపీటీసీ నీలకంఠ, నాయకులు మోహన్‌కృష్ణ, బనగాని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సమన్వయకర్త బుట్టా రేణుక, ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదర్శపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డులో రూ.11 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైస్‌చైర్మన్ నజీర్ అహమ్మద్‌తో కలిసి భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో పార్టీలకతీతంగా సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి ఏఐబీ స్కీం కింద రూ.142 కోట్లతో జీడీపీ నుంచి నీటిని పంపింగ్ చేసే పనులు కొనసాగుతున్నాయన్నారు. టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, పార్టీ నాయకులు రసూల్, గట్టుఖాజ, బాబాఖాన్, రజాక్, రంగన్న, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల అభ్యున్నతికి కృషి: ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 4 శాతం రిజర్వేషన్లు కల్పించగా ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లింలకు రాజకీయంగా ప్రాధాన్యతనివ్వడంతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని బుట్టా రేణుక, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేసిన అనంతరం వారిని కలిసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి పాటుపడే సీఎం జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలని కోరారు. బుట్టా శివనీలకంఠ, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్, వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, కౌన్సిలర్లు ఇషాక్, వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వైద్యంతో పాటు విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత నిస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక పేర్కొన్నారు. ఎమ్మిగనూరు పట్టణంతో పాటు గోనెగండ్ల,



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందిస్తున్న సమన్వయకర్త బుట్టా రేణుక

ఎమ్మిగనూరు మండలాలకు చెందిన ఆరుగురికి సీఎం రిలీఫ్‌ఫండ్ కింద మంజూరైన రూ.9.50 లక్షల చెక్కులను శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆమె అందజేసి మాట్లాడారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జాబితాలో లేని వ్యాధులకు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న వారికి ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం మంజూరైందని వివరించారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ప్రవేశపెట్టడంతో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మద్దతు ఇచ్చి మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మండల పరిషత్ అధ్యక్షులు కేశన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు బందెనవాజ్, కేఎస్ శివన్న, పెద్దమరివీడు నరసన్నచారి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

గోనెగండ్ల మండల పరిధిలోని బి.అగ్రహారం గ్రామ సర్పంచ్ (ఇండిపెండెంట్) రంగారెడ్డితో పాటు టీడీపీకి చెందిన ఎంపీ రంగస్వామి, కె.రంగన్న సహా 200 మంది బుట్టా రేణుక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె వైఎస్సార్‌సీపీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం కృషి చేయాలని వారికి సూచించారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం



తుంబళబీడులో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న విరూపాక్షి

ఆలూరు రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాను మరోసారి ఎగురవేసేందుకు అందరూ సన్నద్ధం కావాలని నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు శేఖర్, సీనియర్ నాయకులు మల్లికార్జున రెడ్డి సమక్షంలో మండలంలోని కమ్మరచేడు గ్రామంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమంపై ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఆ గ్రామ టీడీపీ నాయకులు అశోక్, మనోజ్ రెడ్డి కుటుంబాలు విరూపాక్షి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మండల కన్వీనర్ ఈరన్న, కో-కన్వీనర్ వీరేష్, నాయకులు శ్రీధర్ రెడ్డి, అనిల్ రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం తుంబళబీడు గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జగనన్న పాలనలో మేలు జరిగి ఉంటే మరోసారి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. నాయకులు మల్లికార్జున, వెంకటేష్, రాజశేఖర్, శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

దేవనకొండ: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుసినె విరూపాక్షి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ తపాల శ్రీనివాసనాయుడు తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ హాజరుకావాలని కోరారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

పత్తికొండ రూరల్: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి దివ్య సూచించారు. శుక్రవారం స్థానిక కోర్టులో ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సివిల్/రాజీకాదగిన క్రిమినల్ కేసులను త్వరితగతిన రాజీ మార్గంలో పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. పూర్తి సమాచారం కోసం పోలీసు స్టేషన్‌గానీ న్యాయవాదులను గానీ సంప్రదించాలన్నారు.

బహిరంగ సభలకు అనుమతి ఉండాలి

పత్తికొండ రూరల్: అన్నిరాజకీయ పార్టీలు, విద్యార్థి, మత సంఘాలు, సంస్థలు బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే ఊరేగింపులు, సభలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. రాబోవు అసెంబ్లీ/పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పత్తికొండ పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఎవరైనా ప్రజల శాంతిభద్రతలకు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే సహించేది లేదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనార్టీ నాయకుడి మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): మైనారిటీ నాయకుడు వెల్దుర్తికి చెందిన (ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగి) చాంద్‌బాషా(73) శుక్రవారం తెల్లవారుజామున తన ఇంట్లో హార్ట్‌అటాక్‌కు గురై నిద్రలోనే తుదిశ్వాస వదిలాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కంగాటి రామ్మోహన్ రెడ్డి, బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, గట్టు ఆరిఫ్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

న్యాయవాద సంఘం ఎన్నికలు షురూ

పత్తికొండ రూరల్: పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాద సంఘం ఎన్నికకు నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు బార్ అసోషియేషన్ ఎన్నికల అధికారి ఆవుల మైరాముడు శుక్రవారం తెలిపారు. 18న నామినేషన్ల స్వీకరణ, 20న పరిశీలన, 21న ఉపసంహరణ, అదే రోజు తుదిజాబితా ఉంటుందన్నారు. 25న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, 5 గంటలకు లెక్కింపు ఉంటుందన్నారు. ఎలక్షన్ అసిస్టెంట్ ఆఫీసర్లుగా వై.మధుబాబు, బి.ప్రసాద్‌బాబు ఉంటారని తెలియజేశారు. అర్హులైన న్యాయవాదులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మిగనూరు టౌన్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్‌కు ఈ నెల 28న ఎన్నికలు జరుగనున్నాయి. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎంకె గురురాజారావు, కె.వెంకటేశ్వర్ రెడ్డి శుక్రవారం తమ నామినేషన్లు దాఖలు చేయగా ప్రధాన కార్యదర్శి పదవికి రఘురాం, తిమ్మప్ప నామినేషన్లు వేశారు. అధ్యక్ష, కార్యదర్శి పదవులకు పోటీ ఉండగా ఉపాధ్యక్షుడిగా సుధాకర్, సహాయ కార్యదర్శిగా గోపాలకృష్ణ, కోశాధికారిగా మురళీకృష్ణ, స్పోర్ట్ కార్యదర్శిగా సురేష్, లైబ్రేరియన్‌గా మహబుబ్‌బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా రంగనాథ్, లింగమూర్తి, రామ్మూర్తి వ్యవహరిస్తున్నారు.

క్రాప్ బుకింగ్ రశీదుల పంపిణీ

హాలహర్వి: రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలకు ఫిజికల్ అక్నాలెడ్జ్‌మెంట్ రశీదులను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందజేస్తున్నట్లు ఏఓ శివశంకర్ తెలిపారు. హాలహర్విలోని రైతు భరోసా కేంద్రాన్ని ఏఓ శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో క్రాప్ బుకింగ్ చేసిన జాబితాను ఆర్బీకేల్లో ప్రదర్శించినట్లు చెప్పారు. అనంతరం సర్పంచ్ మల్లికార్జున రైతులకు రశీదులను అందజేశారు. వీఏఏ ఇంద్రజ, రైతులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి ప్రాధాన్యత



రామకొండలో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ అసిస్టెంట్

తుగ్గలి: రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని సచివాలయ కన్వీనర్ సుధాకర రెడ్డి అన్నారు. శుక్రవారం రామకొండలో నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఈఓపీఆర్డీ గోపాల్, పంచాయతీ కార్యదర్శి అంకాలప్పతో కలిసి ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి వైద్యులు ప్రవీణ్, కల్పన, హనుమంత రెడ్డి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని సుధాకరరెడ్డి అన్నారు. స్పెషలిస్ట్ వైద్యులు గ్రామాల్లోనే ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి జబ్బులను గుర్తిస్తారన్నారు. అవసరమైన వారిని ఉన్నత వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు పంపించడం జరుగుతుందన్నారు. వైద్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

హొళగుంద: మండలకేంద్రంలో సర్పంచ్ చలువాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు పంపాపతి, ఈశా, ఎంపీడీఓ ఆజాద్, ఈఓపీఆర్డీ చంద్ర మౌళీశ్వరగౌడ్, తహసీల్దారు ప్రసాద్‌రాజు తదితరులు పర్యవేక్షించారు. వైద్యాధికారులు బింధుమాధవి, న్యూటన్, సాయిజనప్రియ, శివకేశవ రెడ్డి, ప్రతాప్, సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించారు. శిబిరంలో 510 మందిని పరీక్షించగా 10 మందిని మెరుగైన వైద్యం కోసం రేఫర్ చేసినట్లు డాక్టర్ న్యూటన్ తెలిపారు. కంటి వెలుగు కింద 34 మందిని పరీక్షించినట్లు చెప్పారు.

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామ సచివాలయం-2 పరిధిలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్యులు మన్సూర్‌వలీ, ఈఓపీఆర్‌డీ మల్లికార్జున, గైనకాలజిస్ట్ అబీ, అంకాలజిస్ట్ సతీష్, యశ్వంత్, సూపర్‌వైజర్లు ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

మిలటరీ దళాల కవాతు



కృష్ణగిరి మండలంలో సీఆర్‌పీఎఫ్ దళాల కవాతు

కృష్ణగిరి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్లలో ఆత్మస్థైర్యాన్ని నింపడంలో భాగంగా ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఆర్మ్‌డు రిజర్వ్ (సీఆర్‌పీఎఫ్) దళాలు శుక్రవారం మండలంలోని ఆలంకొండ, కోయిలకొండ, చిట్యాల, సీహెచ్ ఎర్రగుడి, కంబాలపాడు గ్రామాలలో కవాతు నిర్వహించారు. వెల్దుర్తి సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, కృష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, పోలీసు సిబ్బంది సీఆర్‌పీఎఫ్ దళాలతో కలిసి కవాతులో పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ఏ చిన్న గొడవ జరిగినా గట్టి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

బస్సు రాలేదని పోలీస్‌స్టేషన్‌కు విద్యార్థులు



పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సుళువాయి విద్యార్థులు

హొళగుంద: సాయంత్రం రావాల్సిన విద్యార్థి బస్సు రాకపోవడంతో సుళువాయి, సమ్మతగేరి, పెద్దహ్యాట తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమ గోడు చెప్పుకున్నారు. ఆ గ్రామాల నుంచి దాదాపు 80 మంది విద్యార్థులు హొళగుంద హైస్కూల్‌కు వస్తుంటారు. శుక్రవారం విద్యార్థులు హొళగుంద బస్టాండులో విద్యార్థి బస్సు కోసం గంటల తరబడి పడిగాపులు కాశారు. ఎంతకు బస్సు రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఏఎస్ఐ శ్రీనివాసులు ఆటోలను మాట్లాడి విద్యార్థులను సొంత గ్రామాలకు పంపించారు. అలాగే సమస్యను ఆదోని ఆర్టీసీ డిపో అధికారుల దృష్టికి తీసుకెళ్లి వేళకు బస్సులు నడపాలని కోరారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



రాతన గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల టీచర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ షర్మిల

తుగ్గలి: మండల పరిధిలోని రాతన గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ షర్మిల తనిఖీ చేశారు. ఒకే కాంపౌండ్‌లో ఆశ్రమ బాలికల పాఠశాల, ఏటీడబ్ల్యూఆర్ బాలుర పాఠశాలను నిర్వహిస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయని స్పందన కార్యక్రమంలో పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ హాస్టల్‌కు వెళ్లి విచారించారు. సొంత భవనం లేకపోవడంతో తమ పాఠశాలకు చెందిన భవనంలోనే ఏటీడబ్ల్యూఆర్ పాఠశాలను నిర్వహిస్తున్నారని టీచర్లు తహసీల్దార్‌కు వివరించారు. పత్తికొండలో ఉన్న ఖాళీ భవనంలోకి బాలుర పాఠశాలను మార్చేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ చెప్పారు. డీటీ నాగేంద్ర, ఆర్ఐ సుధాకర రెడ్డి, వీఆర్వో రామలింగప్ప పాల్గొన్నారు.

సంక్షేమ లబ్ధిని వివరించండి

నందవరం: ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో అందించి హెచ్‌సీఎం కార్డులను లబ్ధిదారులకు అందించి ఈ-కేవైసీ చేయించాలని ఎంపీడీఓ కిరణ్ మోహన్‌రావు సూచించారు. శుక్రవారం నందవరంలో గ్రామ వలంటీర్లచే హెచ్‌సీఎం కార్డుల పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించి, ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారులతో ఈ-కేవైసీ చేయించుకుని కార్డును అందించాలన్నారు. అలాగే సచివాలయ ఉద్యోగులు సేవలను విస్తృతం చేయాలని సూచించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిచాలని, గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులేసు స్వామి ప్రభోత్సవం



ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామంలో శుక్రవారం ఓబులేసు స్వామి ప్రభోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఓబులేసు స్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి మేళతాళాలలతో ఊరేగించారు. ప్రభపై ఓబులేషు స్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మిని అధిష్టించి భక్తులు స్వామివారి నామస్మరణతో గ్రామం నుంచి కొండవరకు లాగారు. నందికోలు, బుక్కపిండి సేవ, నుగ్గులాట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఆనందోత్సవాల మధ్య వసంతోత్సవం జరుపుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉరుసు ప్రశాంతంగా జరుపుకోండి

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో సద్గురు బడేసాహెబ్ తాత ఉరుసును అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ రామకృష్ణయ్య సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఉరుసులో వివిధ పట్టణాలు, గ్రామాల నుంచి దాదాపు లక్ష మంది పాల్గొనే అవకాశం ఉందన్నారు. డీఎస్పీ సీతారామయ్య అధ్వర్యంలో అదనపు బలగాలతో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా వాహనాలను గ్రామం బయటే కేటాయించిన స్థలంలో నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉరుసు మహోత్సవంలో మద్యం సేవించి అల్లర్లు చేయరాదని సూచించారు. పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం



మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పత్తికొండ రూరల్: పత్తికొండ-హోసూరు బైపాస్ క్రాస్ రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న హరియానా మద్యం 20 బాటిళ్లను (750ఎంఎల్) సెబ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సెబ్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, సీఐ స్వర్ణలత వివరాలను వెల్లడించారు. వాహనాల తనిఖీల్లో భాగంగా బైక్‌పై మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేయగా వీరిలో ఒకరు ఏపీఎస్‌పీ కానిస్టేబుల్ ఉన్నారన్నారు. మద్యం తరలిస్తున్న బైక్‌ను సీజ్ చేశామన్నారు. దీంతో పాటు వివిధ కేసుల్లో పట్టుబడిన 140 లీటర్ల నాటు సారా, 317 లీటర్ల కర్ణాటక మద్యం (టెట్రా ప్యాకెట్లు) పత్తికొండ బైపాస్ రోడ్డులో సిబ్బందితో కలిసి ధ్వంసం చేసినట్లు తెలిపారు.

వాహనాల వేలంలో రూ. 3.19 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: స్థానిక సెబ్ పరిధిలో వివిధ కేసులో పట్టుబడిన వాహనాలను వేలంవేయగా ప్రభుత్వానికి రూ.3.19 లక్షల ఆదాయం వచ్చినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన 16 వాహనాలను వేలం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, ఇన్‌చార్జ్ సెబ్ అడిషనల్ ఎస్పీ నాగరాజు ఆదేశాల మేరకు వేలాలు నిర్వహించినట్లు చెప్పారు. 16 వాహనాలకు వేలం నిర్వహించగా జీఎస్టీతో కలుపుకొని రూ.3,19,662 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆయా వాహనాలకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నిర్ణయించిన ధర ఆధారంగా వేలం వేసినట్లు చెప్పారు. సెబ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.